

ప్రీ వెడ్డింగ్ షూట్స్

పెళ్లి వేడుక కలకాలం గుర్తుండేలా యువతీ, యువకులు ప్రీ వెడ్డింగ్ షూట్‌పై ఆసక్తి చూపుతున్నారు. దీంతో అందుకు అనుగుణంగా పలువురు సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 9లో▸

టీకాల వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాలటౌన్: ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవిస్తున్న ప్రతీ ఒక్కరి వివరాలతోపాటు చిన్నారులకు వేసే టీకాల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా టీకాల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం జిల్లాలోని 29 ప్రైవేటు ఆస్పత్రుల్లోని డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నీషియన్లకు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు కోసం ఏర్పాటు చేసిన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై అవగాహన కల్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. తూర్పు దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ఎంపీ’ టికెట్‌కు గడ్డం వంశీక్రిష్ణ దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న గడ్డం వంశీక్రిష్ణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తుల ప్రక్రియ శనివారంతో ముగిసింది. చివరి రోజు గాంధీ భవన్‌లో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు గడ్డం వంశీక్రిష్ణ దరఖాస్తు చేసుకున్నారు. అంతకుముందు జిల్లా నుంచి పెర్క శ్యామ్ సైతం దరఖాస్తు ఇచ్చారు. వీరితోపాటు మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యానారాయణ, మందమర్రి పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్ తదితరులు టికెట్ కోసం అర్జీలు సమర్పించారు.

వీగిపోయిన అవిశ్వాసం



సభ్యులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్‌చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్‌లపై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కౌన్సిలర్ల నోటీసు మేరకు శనివారం ఉదయం 11గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌పై, 12.30గంటలకు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి ప్రిసైడింగ్ అధికారి వాడల రాములు సమావేశం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్నం 3.30గంటలు, 4గంటలకు సమావేశం వాయిదా వేశారు. అప్పటికీ ఎవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరానికి మంచిర్యాల కౌన్సిలర్లు



శిబిరానికి వెళ్తున్న కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని కాంగ్రెస్‌కు చెందిన 26 మంది కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడి నుంచి విమానంలో గోవా శిబిరానికి వెళ్లనున్నట్లు తెలిసింది. ఈ నెల 9న ఉదయం 11గంటలకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్‌గా రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్‌గా సల్ల మహేశ్ పేర్లు ఖరారు కాగా.. ఎన్నిక పూర్తయ్యే వరకు కౌన్సిలర్లు శిబిరంలోనే ఉండనున్నారు. సమావేశం రోజున నేరుగా హాజరు కానున్నారు. మొత్తం 36మంది కౌన్సిలర్లలో 9మంది బీఆర్ఎస్, ఒకరు బీజేపీ, 26మంది కాంగ్రెస్‌లో ఉన్నారు. గత నెల జరిగిన చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానానికి 26మంది కాంగ్రెస్, ఒకరు బీజేపీ కౌన్సిలర్ మద్దతు తెలుపగా.. ఎన్నికలోనూ మద్దతునిచ్చే అవకాశం ఉంది.

విద్యార్థుల ప్రతిభకు పరీక్షలు దోహదం



డీఈవో యాదయ్యతో విజేతలు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి విద్యార్థుల ప్రతిభకు సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ ఎంతో దోహదపడుతుందని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్ ఫోరమ్(టీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ సంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 పాఠశాలల నుంచి 180మంది విద్యార్థులు హాజరయ్యారు. టెస్ట్‌లో ఇంగ్లిష్ మీడియంలో వెల్గనూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి అభినయ్(ప్రథమ), మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని శివనందిని(ద్వితీయ), బజార్ ఏరియా జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి జశ్వంత్(తృతీయ), తెలుగు మీడియంలో కోటపల్లి కేజీబీవీకి చెందిన సంధ్యారాణి(ప్రథమ), కోలంగూడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన లత(ద్వితీయ), బెల్లంపల్లి కేజీబీవీకి చెందిన నాగజ్యోతి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి డీఈవో బహుమతులు అందజేశారు. ఎంఈవో పోచయ్య, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, హెచ్‌ఎం పద్మావతి, సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, మహేష్ పాల్గొన్నారు.

ఉంటారా..? వీడుతారా..?

- రాజకీయ పార్టీలతో నాయకుల మంతనాలు
- అభ్యర్థుల కోసం పార్టీల వెతుకులాట
- ఎంపీ టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- లోక్‌సభ ఎన్నికలకు ముందే కండువా మార్పు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు ముందే రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కొందరు నాయకులు పార్టీ మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని ఆశావహులు కండువాలు మార్చిన విషయం తెలిసిందే. తాజాగా పార్లమెంటు ఎన్నికల్లోనూ లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వారు సైతం తమ అనుకూల పార్టీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయా పార్టీల్లో కీలకంగా ఉండే నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. దీంతో ఎవరెవరు ఏ పార్టీలో ఉంటారో.. ఏ పార్టీలో చేరుతారోనని ఆసక్తిగా మారింది. మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు సైతం బరిలో దింపేందుకు సరైన అభ్యర్థులను వెతికే పనిలో ఉన్నాయి. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సర్వేలు, అభిప్రాయాల సేకరణలు, టికెట్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నాయకుల పార్టీ మార్పులు మరికొద్ది రోజుల్లో బయటపడే అవకాశం ఉంది. ప్రజల్లో ఆదరణ ఉండి.. సరైన అభ్యర్థిగా భావిస్తున్న వారిని సైతం తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఓ మాజీ మంత్రిని తమ పార్టీలో చేరాల్సిందిగా ఓ జాతీయ పార్టీ నాయకులు మంతనాలు సాగిస్తున్నారు. ఆయన పరిస్థితులు గమనిస్తూ పార్టీ మారాలా..? వద్దా..? అనే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్, బీజేపీ వైపు..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైపే నాయకులు తమ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. పెద్దపల్లి లోక్‌సభ స్థానం ఎస్సీ రిజర్వు కావడంతో ఆ సామాజిక వర్గ నాయకులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి ఓ ప్రజాప్రతినిధి కాంగ్రెస్ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండో ఆప్షన్‌గా బీజేపీకైనా వెళ్లి మళ్లీ ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. దీంతో పార్టీలో ఉండి మరోసారి పోటీ చేస్తే గెలిచే అవకాశం తక్కువగా ఉందనే భావనతో ఉన్నట్లు ఓ నాయకుడు ఆయన సన్నిహితులకు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన పార్టీ మారే ఆలోచనతోనే ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఓటమి చెందిన బీఆర్ఎస్ బలహీనపడింది. ఏడు సెగ్మెంట్ల పరిధిలో అన్నింటా కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఈ క్రమంలో బలంగా ఉన్న హస్తం పార్టీ వైపు ఆశావహులు చూస్తున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో ఉన్న నాయకుల్లో పోటీ ఉండడంతో టికెట్ దక్కని క్రమంలో పార్టీ వీడనున్నారు.

ఉద్యోగులు, ప్రజాసంఘాల నుంచి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరు సీనియర్ అధికారులు సైతం ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఢిల్లీ, రాష్ట్ర పరిధిలో తమ పరిచయాలతో పెద్దపల్లి సీటును తమకు ఇవ్వాలని అడుగుతున్నారు. అయితే ఉద్యోగానికి రాజీనామా చేయాలంటే టికెట్ హామీ ఇస్తేనే పార్టీలో చేరుతామనే మెలిక పెడుతున్నారు. ప్రధానంగా పోటీ పడుతున్న వారి లో ఓ పోలీసు అధికారితోపాటు ఉమ్మడి జిల్లా ఉద్యోగ సంఘాల నాయకుడు, ఓ టీచర్, రాష్ట్ర రాజధానిలో ఉన్న మరో అధికారి సైతం పార్టీ మద్దతు కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరు ఏ పార్టీలో చేరుతారనేది కొద్ది రోజుల్లో తేలనుంది.

పంచాయతీలను అభివృద్ధి చేద్దాం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అధికారుల గ్రామ పంచాయతీల పాలన అంశంపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 7నుంచి 15వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాబోయే వేసవిలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ రహిత గ్రామాల దిశగా కృషి చేయాలని అన్నారు. తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు ప్రతీ నియోజకవర్గానికి రూ.కోటి కేటాయించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ సంతోష్ అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 5న జరిగే సమావేశానికి పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

‘మన బడి’పై ప్రతిష్టంభన

చెన్నూర్ జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాలలో 398మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదట్లో బాలికల పాఠశాలగా ఉండగా ఇంగ్లిష్ మీడియం ఏర్పాటుతో బాలురకు ప్రవేశాలు కల్పించారు. పాఠశాల ఆవరణలోని శిథిలమైన భవనాలు తొలగించారు. విద్యార్థుల సౌకర్యార్థం మన ఊరు–మనబడిలో పాఠశాలను ఎంపిక చేసి ఆరు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధుల్లేకనో.. కారణమేమిటో తెలియదు కానీ అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి. గదుల కొరత వల్ల నాలుగు తరగతుల విద్యార్థులు వరండాల్లోనే పాఠాలు చదువుకోవాల్సిన పరిస్థితి.



చెన్నూర్ బాలబాలికల ఉన్నత పాఠశాలలో నిలిచిన అదనపు గదుల నిర్మాణం

- పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు
- అదనపు గదుల్లేక విద్యార్థుల ఇక్కట్లు
- మరుగుదొడ్ల పనులు అంతంతే..
- మౌలిక వసతులకు రూ.2కోట్లపై ఆశలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు గత సంవత్సరం 2022–23లో చేపట్టిన మన ఊరు–మన బడి పనులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లలో పనులపై నిరాసక్తత కనిపిస్తోంది. తొలి విడతలో 245 పాఠశాలలు ఎంపిక చేయగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గదుల కొరతతో ఇరుకు గదులు, వరండాల్లో చదువుకోవాల్సి వస్తోంది.

పనులు ఇలా..

మన ఊరు–మన బడిలో తొలివిడతలో 248 పాఠశాలలు ఎంపిక చేయగా 245 బడుల్లో పనులకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. మూడు చోట్ల వివిధ కారణాలతో పనులు చేపట్టలేదు. నీటి సౌకర్యం, టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి సరిపడా ఫర్నిచర్, మరమ్మతులు చేయడం, కిచెన్‌షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్తవి నిర్మించాలి. ఇందులో 211 పాఠశాలల్లో రూ.30లక్షల్లో పనులు చేయాల్సి ఉంది. ఆ పైగా వెచ్చించాల్సి వస్తే కాంట్రాక్టర్‌తో పనులు చేయించాల్సి ఉంటుంది. చాలా వరకు పనుల్లో చిన్న మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉందని తెలుస్తోంది. నిధుల కొరత వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

పూర్తయ్యేదెన్నడో..

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని మండలాల్లో 69 అదనపు గదులు మంజూరు కాగా 63 పనులు సాగుతున్నాయి. 9పనులు ఫౌండేషన్ లెవల్, 10 బేస్‌మెంటు, 16రూఫ్‌లెవల్‌లోనే ఉన్నాయని తెలుస్తోంది.

మరుగుదొడ్ల పనులు సాగక..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో విఫలమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులు సాగుతూనే ఉన్నాయి. 180 పాఠశాలల్లో మరుగుదొడ్ల పనులు చేపట్టారు. వంద పాఠశాలల్లో 92 చోట్ల పనులు పూర్తి కాగా ఎనిమిది చోట్ల చివరి దశలో ఉన్నాయి. 66 పాఠశాలల్లో పనులు సా..గుతూనే ఉన్నాయి. 14 పాఠశాలల్లో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి కాక బాలికల పరిస్థితి దయనీయంగా మారింది. బాలురు ఆరుబయటకు వెళ్తున్నారు. మరోవైపు ఉన్న మరుగుదొడ్లు స్కావెంజర్లు లేక కంపుకొడుతున్నాయి. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు స్థానిక గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు చేపట్టాలనే నిబంధనలు విధించగా నిర్వహణ లేక భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల హెచ్‌ఎంల సమావేశంలో కూడా స్కావెంజర్ల నియామకంపై చర్చ సాగిందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

బడులకు మంచిరోజులు..!

మన ఊరు–మన బడి పనుల నిధులపై ఎటూ తేల్చకపోవడంతో గందరగోళంగా మారింది. నిధులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు చేసిన మేరకు నిధులు చెల్లిస్తుంటారు. ఈ లెక్కన రూ.24,26,33,000 పనులు చేసినట్లు మెజర్‌మెంటు బుక్(ఎంబీ) నమోదు చేయగా రూ.18,53,96,000 చెల్లించారు. ప్రభుత్వం మారడంతో మిగతా నిధులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు చేసింది. సర్కారు బడుల్లో మౌలిక వసతులకు రూ.2కోట్లు ఖర్చు చేయాలని నిర్దేశించింది. దీంతో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో కనీస సౌకర్యాలతోపాటు సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నారు. మన ఊరు–మన బడి కింద చేపట్టాల్సిన పనులు తుది దశలో ఉండడంతో బడుల మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు కేటాయిస్తారా లేదా అనేది విధివిధానాలు వస్తే గానీ తెలియదు.

పనులు కొనసాగుతున్నాయి

ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మనబడి కింద చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి. నిధుల మంజూరు విషయంపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. పనులపై పర్యవేక్షణ సాగుతోంది.

– యాదయ్య, డీఈవో

స్టీల్‌బ్యాంకుపై అవగాహనేది..!

- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు
- మెప్మా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ
- గత ఏడాది సెప్టెంబర్ 23న ప్రారంభం



స్టీల్ బ్యాంకులోని పాత్రలు

మంచిర్యాలటౌన్: మున్సిపాల్టీల్లో ప్లాస్టిక్ నివారణకు ఎన్ని రకాలుగా చర్యలు చేపడుతున్నా.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా వినియోగం ఏమాత్రం తగ్గడం లేదు. ఫంక్షన్ హాళ్లలో జరిగే శుభకార్యాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినా ఇప్పటికీ మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వస్తువులు విరివిగా వినియోగిస్తూనే ఉన్నారు. దీనిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒసారి వాడి పడేసే ప్లాస్టిక్ సంచులు, వస్తువులను నిషేధించాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతినడంతోపాటు భవిష్యత్ తరాలకు భూసారి తగ్గి పంటలు పండని పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంది. మూగజీవాలు సైతం ప్లాస్టిక్‌ను తిని మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయినా జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లోనూ ప్లాస్టిక్‌ను యథావిధిగా వినియోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్ వస్తువులు వినియోగించాలనే ఉద్దేశ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు.

నియంత్రణ చర్యలు కరువు

ప్లాస్టిక్ వస్తువులు, పాత్రలు వినియోగించవద్దనే ఉద్దేశ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపాలిటీలో గత ఏడాది సెప్టెంబర్ 23న స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్, మెప్మా ఆర్పీలు, టీఎల్ఎఫ్ అధ్యక్షులతో ప్రారంభించారు. రూ.3 లక్షల ఖర్చుతో ఒకేసారి వెయ్యి మందికి సరిపోయేలా శుభకార్యాలకు అవసరమైన వివిధ రకాల పాత్రలు, వస్తువులను అద్దెకు ఇచ్చేలా ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ చేయూతతో ఏర్పాటు చేసిన ఈ స్టీల్ బ్యాంకులోని పాత్రలను బయటి మార్కెట్లో కంటే తక్కువ ధరకు అద్దెకు ఇస్తారు. దీనిని మెప్మాలోని 58 ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఫంక్షన్‌హాల్లో తప్పనిసరిగా ప్లాస్టిక్‌ను వినియోగించవద్దనే నిబంధనలను అమలు చేయకపోవడం వల్ల ఈ స్టీల్ సామగ్రిని అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వెయ్యి మందికి సరిపడా 20 రకాల స్టీల్ వస్తువులన్నీ ఒకే చోట అందుబాటులో ఉంచగా, ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు సైతం తక్కువ ధరకే అద్దెకు అందించే అవకాశం ఉంది. ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించడంతోపాటు ప్లాస్టిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడంతోపాటు స్టీల్ బ్యాంకు నిర్వహణతో మహిళా సంఘాలకు కొంత ఆదాయం సమకూరుతుంది.

స్టీల్ పాత్రలు వినియోగించాలి



మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్‌ను రూ.3 లక్షలతో ఏర్పాటు చేశాం. టీఎల్ఎఫ్ అధ్యక్షులందరం కలిసి నిర్వహిస్తున్నాం. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రత్యామ్నయంగా స్టీల్ సామగ్రిని ఫంక్షన్‌లలో ఉపయోగించేందుకు మెప్మా ద్వారా ఏర్పాటు చేశారు. ప్రజలు ఇళ్లల్లో, ఫంక్షన్ హాల్‌లో జరిగే శుభకార్యాలకు స్టీల్ పాత్రలనే వినియోగించుకోవాలి.

– షాహినా, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు

ప్లాస్టిక్ నియంత్రణకు కఠిన చర్యలు



మెప్మా ద్వారా ఫంక్షన్లలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ఉండేలా స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశాం. ఎన్నికలతో ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు తీసుకోకపోవడం వల్ల మళ్లీ ప్రజలు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచే ప్లాస్టిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకునేలా సిబ్బందిని ఆదేశించాం. ప్లాస్టిక్ వాడిన వారికి జరిమానా విధించడంతోపాటు ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకుంటాం. స్టీల్‌బ్యాంక్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూస్తాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- సమ్మక్క జాతర పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్/నస్పూర్: జిల్లా కేంద్రంలోని గోదావరి నదీ తీరంలో, సీసీసీలోని ముక్కిపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. జాతరకు నిధులు మంజూరు చేయాలని ఇంచార్జి మంత్రిని కోరిన వెంటనే రూ.కోటి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందులో రూ.50లక్షలు మంచిర్యాలకు, రూ.30లక్షలు నస్పూర్‌కు, రూ.20లక్షలు ఇటిక్యాల వద్ద జరిగే జాతరకుకర్చు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. నస్పూర్‌లో సింగరేణి నిధులు ఖర్చు చేస్తే రూ.30క్షలు మంచిర్యాలలో ఖర్చు చేస్తామని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు మూత్రశాలలు, బట్టలు మార్చుకునే గదులు, తాగునీరు, విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి, శాశ్వతంగా ఉండేలా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఏఈ రాజేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్, విద్యుత్ శాఖ డీఈ స్వామి, ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, నాయకులు భూపతి శ్రీనివాస్, గెల్లు మల్లేశ్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం ఆయన పనులను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా పనులు పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

శిబిరానికి కాంగ్రెస్ కౌన్సిలర్లు

నస్పూర్: మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు సీసీసీ నుంచి విజయవాడ శిబిరానికి వెళ్లారు. మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 9న చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నేపథ్యంలో 15 మంది కాంగ్రెస్ సభ్యులు శనివారం బయల్దేరి వెళ్లగా, మరో ఇద్దరు త్వరలోనే చేరుతారని నాయకులు తెలిపారు. వీరంతా సమావేశం జరిగే రోజు నేరుగా హాజరు కానున్నారు. కాగా మున్సిపాలిటీలో 25 మంది సభ్యులకుగాను కాంగ్రెస్‌కు 17 మంది, ఇద్దరు సీపీఐ సభ్యుల మద్దతుతో కలిపి 19 మంది సభ్యుల బలం ఉంది. బీఆర్ఎస్‌కు ఆరుగురు సభ్యుల బలం ఉంది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కావాల్సిన 17 మంది సభ్యుల కంటే మరో ఇద్దరు సభ్యుల బలం కాంగ్రెస్‌కు అధికంగా ఉండడంతో ఎన్నిక లాంఛనమే కానుంది. జనవరి 12న చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడం, తీర్మానానికి ముందే వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే.

సిజేరియన్ ప్రసవాలపై చర్యలు

- వైద్యాధికారులకు మెమోలు
- డీఎంహెచ్‌ఓ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ద్వారా ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కారణం లేకుండా సిజేరియన్ చేసే ఆస్పత్రులపై చర్యలకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధమైందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం సిజేరియన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలకు వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 14 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా సిజేరియన్ల ద్వారా ప్రసవాలు చేస్తున్నారని, ఎందుకు చేస్తున్నారో తెలుసుకునేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా ఆస్పత్రుల్లో ఆడిట్ అనంతరం, కావాలని సిజేరియన్‌లు చేసినట్లు గుర్తిస్తే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, క్షయవ్యాధి, సికిల్ సెల్ ఎ నిమియా, అసంక్రమణ వ్యాధులు, వంద శాతం గర్భిణుల రిజిస్ట్రేషన్ నమోదులో వెనుకబడిన పీహెచ్‌సీ వైద్యాధికారులు 14 మందికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆస్పత్రులు మెరుగ్గా ఉన్నాయని, ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయుడు

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం


దగ్ధమైన సామగ్రి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ మజీద్ ముందు గల ఆటో డ్రైవర్ ప్రభాకర్ ఇంటిలో శనివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంటిలో నుంచి పొగలు బయటకు రావడంతో చట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన వస్తువులు కాలిపోయాయి. దీంతో సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

108లో ప్రసవం


పాపను అందిస్తున్న సిబ్బంది

కాసిపేట: 108లో గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వేమనపల్లి మండలం బొమ్మెన గ్రామానికి బొట్టు పద్మ మూడో కాన్పులో భాగంగా బెల్లంపల్లి ఆస్పత్రిలో చేరింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది మంచిర్యాల మాతాశిశు కేంద్రానికి ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేయగా కాసిపేటకు చెందిన 108లో తరలిస్తుండగా పులిమడుగు వద్దకు వెళ్లగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఆత్మరావు, పైలట్ ఎండీ అసఫ్ పాషాలు ప్రసవం చేయగా సాధారణ డెలివరీలో పాపకు జన్మనిచ్చింది. వారిని మాతాశిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు.

ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన చౌదరి లక్ష్మణ్ ఫెన్సింగ్‌కు విద్యుత్ వైర్లు అమర్చినందుకు కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. లక్ష్మణ్ తన కర్బుజ తోట చుట్టూ ఫెన్సింగ్‌కు విద్యుత్ షాక్ అమర్చాడు. అదే ప్రాంతంలో కడంబాకు చెందిన మహేష్ గొర్రెలను మేపుతుండగా ఒక గొర్రె విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందింది. దీంతో మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు

- ఎస్‌డీఎఫ్ వినియోగ బాధ్యత ఇన్‌చార్జి మంత్రికి
- ఎమ్మెల్యేలు అడగకుండానే రూ.10కోట్ల చొప్పున కేటాయింపు
- మార్చి నెలాఖరు వరకు వాటి ఖర్చుకు అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు



కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర చరిత్రలో ఎమ్మెల్యేల విజ్ఞప్తులు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలకు వంద కోట్లు కేటాయిస్తూ జీవో నం.1687ను జారీ చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు అప్పగించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సంబంధిత అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాల్సి ఉంటుంది. సీతక్క ఆదేశాల మేరకు వాటిని వెచ్చించాలి. ఈ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవరాల్లో చేపట్టే పనుల ప్రతిపాదనల కసరత్తులో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం

ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగంలో ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యతినిచ్చింది. ఒక్కో ఎమ్మెల్యేకు కేటాయించిన రూ.10కోట్లలో రూ.2కోట్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలని ఆదేశించింది. మరో కోటి రూపాయలను అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు వెచ్చించాలని సూచించింది. మరో రూ.50లక్షలను కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలలు, తాగునీరు, కార్యాలయాల నిర్వహణకు సంబంధించి రూ.3.5 కోట్లు పోగా మిగిలిన రూ.6.5 కోట్లను తమ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక తనిఖీలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. తద్వారా నాణ్యత ప్రకారంగానే జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేల్లో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పలుమార్లు విన్నవించినా నిధులు విడుదలయ్యేవి కావని, ప్రస్తుత ప్రభుత్వం అడగకుండానే పది కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేలు అడగకుండానే ...

సాధారణంగా ఎస్‌డీఎఫ్ నిధులను ఎమ్మెల్యేల విజ్ఞప్తుల మేరకే ప్రభుత్వం విడుదల చేస్తోంది. తమ నియోజకవర్గ పరిధిలో ఫలాన పనులు చేపట్టాల్సి ఉందని, అందుకు ప్రత్యేక నిధులను కేటాయించాలని ఎమ్మెల్యేలు సీఎంను కోరితే అందుకనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తెలంగాణలోని పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇలాగే జరిగేది. కానీ కొత్తగా బాధ్యతలను చేపట్టిన రేవంత్‌రెడ్డి సర్కారు ఎమ్మెల్యేలు అడగకుండానే ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులను కేటాయించింది. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలకు వంద కోట్ల నిధులను విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు బీజేపీ, కాంగ్రెస్ చెరో నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇద్దరు ఉన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు సైతం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

...l Development Fund – According Administrative Sanction for an ... 190.00 crore @ Rs.10.00 crore per Assembly Constituency for ... opmental works in the districts to be approved by the District in-charge ... rked an amount of Rs.2.00 crore towards Education Infrastructure (Gov... Body), Rs.1.00 crore for Drinking water and Rs.50.00 lakh for maint... torates / Govt. offices purposes per Assembly Constituency under SDF ... – Issued.

PLANNING (VI) DEPARTMENT

...t.No.22 Date:30.01... Read

G.O.Ms.No.1687, General Administration (Poll B) Department, dated:24...

Government have decided to provide an amount of Rs.1,190... 10.00 crore per Assembly Constituency for taking up developmental wo... ts to be approved by the District in-charge Ministers, earmarkin... 00 crore per each Assembly Constituency an amount of Rs.2.00 cror... tion Infrastructure (Government / Local Body), Rs.1.00 crore for Drink... s.50.00 lakh for maintenance of Collectorates / Govt. offices purposes ... e "Special Development Fund for Welfare and Development Activities" ... 023-24.

After careful examination, Government hereby accord administrative sa... 190.00 crore @ Rs.10.00 crore per Assembly Constituency for t... pmental works in the districts to be approved by the District in-charge ... ming out of Rs.10.00 crore per each Assembly Constituency an a... 0 crore towards Education Infrastructure (Government / Loca... 0 crore for Drinking water and Rs.50.00 lakh for maintenance of Colle...

ప్రభుత్వం జారీ చేసిన జీవో

రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆత్మహత్య

- పది రోజుల క్రితమే అడవిలో ఉరేసుకున్న వైనం
- కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం


మృతుడు పులి చంద్రశేఖర్(ఫైల్)

తాండూర్: రిటైర్డు ఆర్మీ జవాన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో చేటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.... శనివారం గ్రామానికి చెందిన కొందరు మహిళలు వంటచెరుకు కోసం శ్మశానం సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరేసుకుని కుళ్లిన స్థితిలోని మృతదేహం కనిపించింది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాదారం ఏఎస్సై పెద్దయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గుర్తుపట్టడానికి సైతం వీలులేకుండా ఉన్న మృతదేహం పక్కన ఉన్న కవర్‌లో మృతుడి బ్యాంక్ పుస్తకం, ఆధార్ కార్డుల ఆధారంగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ పులి చంద్రశేఖర్ (40)గా గుర్తించారు. అయితే చంద్రశేఖర్‌లో ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహించి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరుచుగా గొడవపడేవాడు. అదే క్రమంలో మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన చంద్రశేఖర్ మాదారం టౌన్‌షిప్ సమీపంలోని అడవిలో మృతి చెంది కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సమ్మె విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అక్బర్ అలీ

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు తెలిపారు. శనివారం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో బెల్లంపల్లి రీజియన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఎనిమిది గంటల పని దినాలను 12గంటల పనిదినాలుగా మార్చి కార్మికుల శ్రమ దోపిడీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలను, జీవో 22 ప్రకారం వేతనాలను సింగరేణిలో చెల్లించాలని వివరించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అందరూ ఒక్కరోజు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శులు అఫ్రోజ్‌ఖాన్, దొడ్డిపట్ల రవీందర్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం, నాయకులు గట్టు మహేందర్, సంతోష్, విశ్వనాథ్, మేకల రాములు, యాదగిరి, ఖాతరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మమ్మీ..డాడీ.. లండన్ స్టాంపింగ్ ఉంది.. రండి

- తల్లిదండ్రులకు చెప్పిన యువకుడు రైల్వేట్రాక్‌పై విగతజీవిగా..


చల్ల విష్ణు(ఫైల్)

చెన్నూర్/కాళేశ్వరం: 'ఈనెల ఆరో తేదీన యూకే (లండన్) వెళ్లడానికి స్టాంపింగ్ ఉంది. మమ్మీ.. డాడీ హైదరాబాద్‌కు రావాలి' అంటూ కుమారుడు చల్ల విష్ణు(24) శుక్రవారం తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. శనివారం తెల్లవారుజామున జనగామ జిల్లా రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో విషాదం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన చల్ల సుజాత–రాజేశ్వర్‌రెడ్డి దంపతులు జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కొన్ని రోజులుగా కిరాణం నడిపిస్తూ ఇద్దరు కుమారులను చదివిస్తున్నారు. బీటెక్ పూర్తి చేసిన కుమారుడు విష్ణు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి అమెరికాలో ఉద్యోగం చేయాలనే కోరిక ఉండేది. గతంలో రెండుసార్లు పాస్‌పోర్టు స్టాంపింగ్ వరకు వచ్చి ఫెయిలైంది. మళ్లీ ప్రయత్నించాడు. యూకే(లండన్) వెళ్లడానికి తల్లిదండ్రులు ఇంటి నుంచి కొంత డబ్బు సైతం పంపించారు. ఈ క్రమంలో లండన్ వెళ్లడానికి స్టాంపింగ్ ఉంది. మమ్మీ.. డాడీ హైదరాబాద్‌కు రావాలని ఫోన్ కాల్ రావడంతో శనివారం తెల్లవారుజామున వారు బస్సులో బయలుదేరారు. హనుమకొండకు చేరేలోపు జనగామ రైల్వే పోలీసులు ట్రాక్‌పై మృతదేహాన్ని గమనించి ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ ఆధారంగా తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పారు. చేతికందిన కొడుకు అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇదిలా ఉండగా.. యూకే స్టాంపింగ్ కూడా ఫెయిలైందా.. లేక మధ్యలో బ్రోకర్ ఏమైనా మోసం చేశాడా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌రూరల్: ఈ నెల 5 నుంచి 11వరకు పలు రైళ్లు రద్దయినట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాస్ తెలిపారు. మౌలాలి ప్రాంతంలో నాన్ ఇంటర్ లాకింగ్(ఎన్ఐ) పనులు చేస్తుండడంతో రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్(17012) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్(12757) కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్(12758) వరకు వెళ్లే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయినట్లు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్(17233) వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట జంక్షన్ వరకు, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్(17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట జంక్షన్ వరకు నడుస్తాయని తెలిపారు.

ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ ఇన్‌స్పైర్ పోటీల్లో 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 2022–23 సంవత్సరానికి 102 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా డిసెంబర్ 20, 2012 నుంచి జనవరి 31, 2024వరకు విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్ట్ వీడియోలు, సంబంధిత ఫొటోలు, వివరాలను ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్‌లో నమోదు చేశారు. జాతీయ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ప్రతినిధులు అభినాష్, శుభ్రత్ నేతృత్వంలో స్థానిక, గుజరాత్ సంబంధిత న్యాయనిర్ణేతలు సంయుక్తంగా ఈనెల 1, 2న ప్రాజెక్టుల పరిశీలన చేశారు. వీటిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 10మంది విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు డీఈవో యాదయ్య, డీఎస్‌వో మధుబాబు తెలిపారు.

నేడు రైతు అవగాహన సదస్సు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ఆదిలాబాద్ జిల్లా నాబార్డ్ సంస్థ సహకారంతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు మంచిర్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో రైతు అవగాహన సదస్సు, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు హాజీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ రైతు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, విశిష్ట అతిథిగా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న సాగర్

బెల్లంపల్లి: పెండింగ్‌లోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై దృష్టిసారించాలన్నారు. ఇంత వరకు ఆ దిశగా యోచించకపోవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, కంప్యూటర్ విద్యను అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్‌ను జారీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘ నాయకులు గీత, సాగరిక, శ్రీకాంత్, సాగర్, స్రవంతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన కిష్టాపూర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి

జన్నారం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షల్లో జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం గుండ రాజన్న తెలిపారు. పరీక్షల్లో పదో తరగతికి చెందిన విష్ణువర్ధన్, తొమ్మిదో తరగతికి చెందిన అరవింద, 8వ తరగతికి చెందిన అక్షయ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అదే విధంగా ఇన్‌స్పైర్ మానక్‌లో అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రేజావత్ విజయ్‌కుమార్ తయారు చేసిన స్టూడెంట్ ఫ్రెండ్లీ కారేజ్ ఫర్ ద బైసకిల్ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి యాదయ్య అభినందించారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు పోటీలు


బహుమతులు అందజేసిన డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి సైన్స్‌పై ఆసక్తి, సృజనాత్మకత శక్తిని వెలికితీయటానికి చెక్‌ముక్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం జిల్లా సైన్స్ సెంటర్‌లో జనవిజ్ఞాన ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలో హేతుబద్ధత ఎన్నో నూతన ఆవిష్కరణలకు, నైపుణ్యతకు దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ మీడియం నుంచ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ మంచిర్యాల గరల్స్ జోయ, ఇషా తహరీ, సభానాజ్ , ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి చెన్నూర్ చిన్నమున్ని పబ్లిక్ స్కూల్‌కు చెందిన సాత్విక, సియా గిల్డ, హర్షిత్ దేవరాజ్ ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు డీఈవో యాదయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, ఎంఈవో పోచయ్య, సమగ్రశిక్షా కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డీఎస్‌వో మధుబాబు ఉన్నారు.

పాఠశాల విద్యార్థులకు పోటీలు..

తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి, పర్యావరణ పరిరక్షణ, శిక్షణ పరిశోధన కేంద్రం కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 28న జాతీయ స్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులకు పెయిటింగ్, కవిత్వం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్, ఉప అంశాలుగా చెత్తను తొలగించటం, ఇ–వ్యర్థాలను తొలగించడం వంటి అంశాలపై పోటీలుంటాయన్నారు.

18నుంచి గూడెం బ్రహ్మోత్సవాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో ఈ నెల 18 నుంచి 25వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 21న జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి సతీసమేతంగా హాజరు కావాలని కలెక్టర్ సంతోష్‌ను ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ శనివారం ఆహ్వానించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

బొగ్గు పెన్షనర్ల డిమాండ్ల పరిశీలన

నస్పూర్: బొగ్గు పెన్షనర్ల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు పెన్షన్‌దారుల పింఛన్ పెంపుదలను పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 12న నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో బిలాస్‌పూర్‌లో నిర్వహించనున్న సదస్సులో అన్ని డిమాండ్లు అధికారులతో చర్చిస్తామని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దు

మందమర్రిరూరల్: సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వం జోక్యం ఉందనే ఆ యూనియన్‌కు సింగరేణి ఉద్యోగులు బుద్ధిచెప్పారని తెలిపారు. ఇప్పుడు గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే తీరును ప్రదర్శిస్తుందన్నారు. ఈ నెల 6,7 తేదీల్లో ఉద్యోగ నియామక పత్రాలు హైదరాబాద్‌లో ఇస్తున్నారని, అక్కడికి రావాలని యాజమాన్యం పేర్కొనడంలో రాజకీయ కుట్ర ఉందన్నారు. ఏరియాల్లోనే అందించాలని డిమాండ్ చేశారు.

నియామక పత్రాలకు యాజమాన్యం అంగీకారం

నస్పూర్: ఇటీవల మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల వారసులు, ప్రమోషన్లకు వేచి చూస్తున్న ఇంటర్నల్ అభ్యర్థులు, జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేయడానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గనులలో డిపార్ట్‌మెంట్ల వద్ద నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

తప్పిన ప్రమాదం


ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు

చింతలమానెపల్లి: మండలంలోని కర్జెల్లీ గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగడంతో బస్సు ఒక్కసారిగా రోడ్డు పక్కకు వెళ్లింది. శనివారం మధ్యాహ్నం గూడెం నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కర్జెల్లీ సమీపంలోకి రావడంతో ఒక్కసారిగా స్టీరింగ్ విరిగిపోయింది. దీంతో డ్రైవర్ జాగ్రత్తతో పెను ప్రమాదం తప్పింది.

సెమీ ఫైనల్‌కు తెలంగాణ జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ స్థాయి ఎస్‌డీఎఫ్ ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు క్వాటర్ ఫైనల్ హర్యానాపై విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరినట్లు డీఎస్‌వో మీనారెడ్డి శనివారం తెలిపారు. జనవరి 31 నుంచి జర్ఖాండ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి క్రీడల్లో మన తెలంగాణ బాలుర ఖోఖో జట్టు ప్రతిభ కనబర్చి సెమీ ఫైనల్‌కు చేరుకున్నట్లు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. జిన్నింగ్ మిల్లులో కొనుగోలు పెరిగినందుకు స్టాక్ ఎక్కువగా ఉండడంతో కొద్ది రోజుల పాటు కొనుగోలు నిలిపివేస్తున్నామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

టీఎన్‌జీవో సంఘం బెల్లంపల్లి యూనిట్ ఎన్నికలు


సభ్యులకు సన్మానం చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి యూనిట్ టీఎన్‌జీవో సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీనివాస్, కార్యదర్శి భూముల రాంమ్మోహన్, అసోసియెట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు ముఖ్య అతిథులుగా హాజరై ఎన్నికలు నిర్వహించారు. బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడిగా జి.వెంకటేశం(వసతి గృహ సంక్షేమ అధికారి), ఉపాధ్యక్షుడిగా సయ్యద్ ఇర్ఫాన్(సీనియర్ అకౌంటెంట్), కార్యదర్శిగా సీహెచ్.అంజన్‌కుమార్ (గిర్దావర్), మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా టి.విజయలక్ష్మీ(గిర్దావర్), నిర్వహణ కార్యదర్శిగా జె.మల్లయ్య(సీనియర్ అసిస్టెంట్), కోశాధికారిగా కొంక నాగరాజు(పంచాయతీ కార్యదర్శి), ప్రచార కార్యదర్శిగా గాజుల సునిల్(జూనియర్ అసిస్టెంట్), కార్య నిర్వాహక సభ్యులుగా కె.తపస్‌కుమార్ కర్మకర్ (పంచాయతీ కార్యదర్శి), వి.శ్రీధర్ (పంచాయతీ కార్యదర్శి)లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కూర్మచలం శ్రీనివాస్ ప్రకటించారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శాలువా కప్పి సన్మానం చేశారు.

WANTED



Wanted Principal with Qualified M.Sc. Nursing and Minimum 5years of Experience and also Experienced and Qualified M.Sc. Nursing / B.Sc. Nursing faculty to teach in our College.

ESTD: 2003

SRKM College of Nursing
Mancherial. Contact: 8374585229, 9866231292. mail: srkmcon153@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

VEHICLE AUCTION

Vehicle for Auction - On where condition Maruti Dzire VXI TS 22 F 4033. Indus ind bank, MNCL 8790148866 [K-1187340]

EDUCATION

One Sittting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

SERVICES

ఓల్డేజ్ హోం

సాయి హోంకేర్ & ఓల్డేజ్: వృద్ధులకు, పేషంట్లకు అన్ని రకముల సేవలకు 24 గం. ఆటెండర్సను పంపగలము. (ఆయాలు, అటెండర్స్ కావలెను జీ+భో+వ (ఫ్రీ) ✆ 7569630177, 9398866009. [B-1206329]

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ ఆవులను చూసుకొనుటకు కావలెను. ఫోన్ 9391036931, 9246585901. [HA-13030]

ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20k ఫోన్: 8977639662/8977639663. [H-793685]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-801571]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,